సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం : 26 : ఆగస్టు : 2023



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: శ్రావణమాసం శుక్రవారం వేములవాడ రాజన్నను 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



పాఠశాలను పరిశీలించిన డీఈవో

వేములవాడఅర్బన్: వేములవాడలోని కేజీబీవీని డీఈవో రమేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలోని పలు రికార్డులు తనిఖీ చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యనందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని మైనారిటీ గురుకుల పాఠశాల, హాస్టల్‌ను శుక్రవారం కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. బోధన తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫాంలు ఇచ్చారా, భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా.. లేదా.. అని ఆరా తీశారు. ప్లే గ్రౌండ్ లేదని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో అందుబాటులో ఉన్న ప్రైవేటు స్థలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని ఎంపీడీవో లచ్చాలును ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు గురుకులానికి సరఫరా అయ్యేలా చూడాలని ఇంజినీర్లను ఫోన్‌లో ఆదేశించారు. డీపీవో రవీందర్, మైనారిటీ సంక్షేమ ఓఎస్డీ సర్వర్, ఎంపీడీవో పి.లచ్చాలు, ప్రిన్సిపాల్ స్వప్న, సిబ్బంది సాధన పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరు



సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నాన్చివేత ధోరణి అవలంబిస్తుందని యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని శివనగర్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సమస్యల సాధనకు సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. నాయకులు వై.అశోక్‌కుమార్, వి.రాజిరెడ్డి, టి.సుధీర్, టి.లక్ష్మారెడ్డి, గోల్కొండ శ్రీధర్, ఎస్.కనకయ్య, ఎం.రాజయ్య, జిల్లా బాధ్యులు పాకాల శంకర్‌గౌడ్, దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, కుమ్మరి మల్లేశం, ఉత్తం విజయ్‌కుమార్, గుండమనేని మహేందర్‌రావు, దుమాల రమానాథరెడ్డి, అవురం సుధాకర్‌రెడ్డి, కె.రాజలింగం పాల్గొన్నారు.

నేతన్నలకు నిధులు మంజూరు


సిరిసిల్ల: నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం ద్వారా రూ.50 కోట్లు టెస్కోకు మంజూరు కాగా.. ఇందులో ఆసాములకు చెల్లించాల్సిన పింజర్ల డబ్బులు రూ.10కోట్లు కేటాయించారు. రంజాన్ వస్త్రాలు అందించిన నేతన్నలకు 90 శాతం మేరకు చెల్లింపులు చేయనున్నారు. స్కూల్ యూనిఫామ్స్ కోసం సర్వశిక్ష అభియాన్‌లో వస్త్రాలు సరఫరా చేసిన వారికి 40 శాతం మేరకు పేమెంట్ చెల్లించనున్నారు.

పింజర్ల డబ్బులు ఇవ్వాలి



సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలు నేసే ఆసాములకు పింజర్ల సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని మ్యాక్స్ సంఘాల అసాములు డిమాండ్ చేశారు. వారు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దసేట్లకు సంబంధించిన ఎస్ఎస్ఐ యూనిట్లకు పింజర్ల డబ్బులను ప్రభుత్వం జమచేసిందని, చిన్న ఆసాములైన తమపై కక్ష ఎందుకని ప్రశ్నించారు. తమకు రావాల్సిన పింజర్ల సబ్సిడీ డబ్బులు ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, కార్యదర్శి చేరాల అశోక్, మండల రాజు, ఆనందం, శంకర్, శ్రీనివాస్, సుభాష్ ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంల వినూత్న నిరసన



సిరిసిల్లటౌన్: రెండో ఏఎన్‌ఎంలు శుక్రవారం పదోరోజు నిరసన దీక్షలను వినూత్నంగా చేపట్టారు. సిరిసిల్లలో దీక్షా శిబిరంలో వరలక్ష్మీ వ్రతం చేస్తూ ప్రభుత్వానికి కనువిప్పు కల్పించాలని కోరారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, అజ్జ వేణు, సంఘీభావం తెలిపారు. దీక్షల్లో సరోజ, కరుణశ్రీ, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరైనా 'హస్తగతం' కావాలి!

- ఉమ్మడి జిల్లాలో సత్తా చాటేందుకు కాంగ్రెస్ వ్యూహం
- 13 స్థానాల్లో ఆరుచోట్ల విజయంపై ధీమా
- నెలాఖరున పార్టీలో చేరనున్న మాజీ ఎంపీ జి.వివేక్?
- గాంధీభవన్‌లో 40కిపైగా దరఖాస్తులు, గరిష్ఠంగా కరీంనగర్‌కు..
- పారిశ్రామికవేత్తల చేరికలతో పార్టీ బలోపేతంపై ధీమా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



కర్ణాటక ఎన్నికల ఫలితాలతో కొత్త ఉత్సాహంతో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఈసారి సానుకూల పవనాలు వీస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఇటీవల బీఆర్‌ఎస్ ప్రకటించిన దరిమిలా.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వాతావరణం మొదలైంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా బరిలో నిలిచే అభ్యర్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా కనీసం ఆరు స్థానాలు సాధించాలన్న వ్యూహంతో మెరికల్లాంటి అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలో ఉంది. ప్రభుత్వ వ్యతిరేకత, సీనియర్లపై సానుభూతి, కొత్తగా పార్టీలోకి చేరుతున్న నాయకగణం తదితర కారణాలు ఈసారి జిల్లాలో తమకు గౌరవప్రదమైన సంఖ్యలో ఎమ్మెల్యేలను గెలిపిస్తాయని అధిష్టానం బలంగా నమ్ముతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ స్థానాల్లో తమకు ఎంతలేదన్నా.. కనీసం ఆరేడుకు తగ్గకుండా గెలిచి తీరుతామన్న ధీమాతో కాంగ్రెస్ ముందుకెళ్తోంది.

ఈ స్థానాలు కీలకం..!

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు, థర్డ్ పార్టీ సర్వేల అనంతరం పెద్దపల్లి(విజయరమణారావు), మంథని(దుద్దిళ్ల శ్రీధర్ బాబు), రామగుండం(రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్), ధర్మపురి(అడ్లూరి లక్ష్మణ్), వేములవాడ(ఆది శ్రీనివాస్), హుస్నాబాద్(పొన్నం ప్రభాకర్), జగిత్యాల(జీవన్‌రెడ్డి) స్థానాల్లో తమ అభ్యర్థులు బలంగా ఉన్నారని, అధికార బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఇస్తారని కాంగ్రెస్ ధీమాగా ఉంది. చొప్పదండి(మేడిపల్లి సత్యం), మానకొండూరు(కవ్వంపల్లి సత్యనారాయణ), సిరిసిల్ల(కేకే మహేందర్ రెడ్డి), కోరుట్ల(జువ్వాడి నర్సింగరావు) కూడా ఈసారి తమకు స్థానికంగా సానుకూల పరిస్థితులు ఉన్నాయని నమ్ముతున్నారు. హుజూరాబాద్ నుంచి మరోసారి బల్మూరి వెంకట్ బరిలోకి దిగనున్నారన్న ప్రచారం నడుస్తోంది. అన్నింటికంటే చివరిగా కరీంనగర్ స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానానికి పార్టీలో తీవ్రపోటీ నెలకొంది. మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు మేనేని రోహిత్, పొన్నం ప్రభాకర్ మధ్య పోటీ ఉన్నా.. పొన్నం హుస్నాబాద్‌కు వలస వెళ్లడంతో రోహిత్‌కు దాదాపుగా రూట్ క్లియర్ అయింది. అదేసమయంలో మైత్రీ గ్రూప్స్ అధినేత కొత్త జయపాల్‌రెడ్డి పార్టీలో చేరడంతో మరో ఆశావహుడు పెరిగినట్లయింది. దరఖాస్తుల పరంగా చూసినా.. కరీంనగర్‌కు ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది, తర్వాత స్థానంలో కోరుట్లకు పోటీ ఉంది.

దరఖాస్తులు ఇలా

కరీంనగర్: 1.కొనగాల మహేశ్, 2.కర్ర సత్య ప్రసన్నరెడ్డి, 3.సమద్‌నవాబ్, 4.రేగులపాటి రమ్యరావు, 5.కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, 6.వైద్యుల అంజన్‌కుమార్, 7.మేనేని రోహిత్‌రావు, 8.రహమాత్ హుస్సేన్, 9.పాడాల రాహుల్, 10.కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, 11.కొత్త జైపాల్‌రెడ్డి

హుజూరాబాద్: 1.బల్మూరి వెంకట్, 2. పత్తి కృష్ణారెడ్డి, 3. దాసరి భూమయ్య , 4. సాయిని రవి

మానకొండూరు: 1. కవ్వంపల్లి సత్యనారాయణ

చొప్పదండి: 1. మెన్న రాజ మల్లయ్య, 2. బండ శకుంతల, 3. నాగి శేఖర్

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్

జగిత్యాల: 1.తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ధర్మపురి: 1.గజ్జల స్వామి, 2. మద్దెల రవీందర్, 3.బండారి కనుకయ్య, 4. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, 5.వడ్లూరి కృష్ణ, 6. బొల్లి స్వామి

కోరుట్ల: 1. జువ్వాడి నరసింగరావు, 2. కొమిరెడ్డి జ్యోతక్క, 3. కల్వకుంట్ల సుజిత్ రావు, 4. కోమిరెడ్డి కరంచంద్ , 5. కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, 6. మహమ్మద్ షాకీర్, 7. సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

పెద్దపల్లి: 1. చింతకుంట విజయరమణారావు, 2. గంట రాములు యాదవ్, 3. ఈర్ల కొమురయ్య

మంథని: 1.దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, 2.ప్రమోద్‌కుమార్

రామగుండం: 1. ఎంఎస్ రాజ్ ఠాకూర్, 2. జనక్ ప్రసాద్, 3. రియాజ్ అహ్మద్, 4. వెంచర్ల మహేశ్

సిరిసిల్ల: 01. కేకే మహేందర్ రెడ్డి, 02. చీటీ ఉమేశ్ రావు, 03. సంగీతం శ్రీనివాస్, 04. నాగుల సత్యనారాయణ గౌడ్

వేములవాడ: 1. ముడిక చంద్రశేఖర్, 2. తొట్ల అంజయ్య, 3. సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

కాంగ్రెస్ గూటికి మాజీ ఎంపీ వివేక్!?

పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి మరోసారి పార్టీ మారనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఈనెల 30వ తేదీ తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి రాజకీయ వారసుడిగా 2009లో పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. 2014లో కాంగ్రెస్ నుంచి ఓడాక బీఆర్‌ఎస్‌లో చేరి ప్రభుత్వ సలహాదారుగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమి కోసం ప్రయత్నించారన్న విమర్శలతో పార్టీ ఆయనను పక్కనబెట్టింది. అప్పటినుంచి ఆయన బీజేపీలో కొనసాగుతున్నారు. ఐదేళ్లుగా జాతీయ పార్టీలో పనిచేసినా సరైన ప్రాధాన్యం దక్కలేదన్న ఆవేదనతో తిరిగి మాతృపార్టీ కాంగ్రెస్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



మాజీ ఎంపీ వివేక్

ఈ క్రమంలోనే పార్టీలో హస్తం పార్టీ నుంచి ఆయనకు గ్రీన్‌సిగ్నల్ వచ్చిందని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి సీటు ఇస్తామన్న హామీతో ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిసింది. అంగబలం, అర్థబలం దండిగా ఉన్న వివేక్ పార్టీలో చేరితే.. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్నిస్థానాల అభ్యర్థులకు అండగా నిలుస్తారని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

వ్యవసాయరంగ ప్రభుత్వ సలహాదారుగా రమేశ్‌బాబు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును రాష్ట్ర వ్యవసాయరంగ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. తనకు కేబినెట్ హోదా కల్పించడంపై సీఎంను కలిసి రమేశ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. రమేశ్‌బాబు జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. వ్యవసాయ ప్రొఫెసర్‌గా రమేశ్‌బాబుకు ఉన్న అనుభవాన్ని రాష్ట్రంలోని వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం భావించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో వేములవాడలో ఇన్నాళ్లు వేడెక్కిన రాజకీయం ఒక్కసారిగా చల్లబడింది. గ్రూపులుగా విడిపోయిన బీఆర్‌ఎస్ నేతలు మళ్లీ ఏకతాటిపైకొచ్చారు.

దొంగగా భావించి దేహశుద్ధి

- గాయపడ్డ ఉత్తరప్రదేశ్ యువకుడు
- జరిగిన తప్పిదంతో మదనపడుతున్న పోలీసులు



వేములవాడ: వేములవాడ టౌన్ నుంచి వాహనాన్ని తీసుకెళ్తున్న వ్యక్తిని దొంగగా భావించి దేహశుద్ధి చేసిన ఘటన శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. మెకానిక్ ప్రభాకర్, బాధితుడు సికిందర్ తెలిపిన వివరాలు. వేములవాడ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ప్రభాకర్ మెకానిక్‌షాప్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సికిందర్ పనిచేస్తున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న జమాలొద్దీన్ బైక్ నడవడం లేదని.. రిపేర్ చేయించేందుకు స్టేషన్ ఆవరణలో ఉన్న బైక్‌ను తీసుకురమ్మని సికిందర్‌ను పంపించాడు. బైక్ తీసుకొస్తున్న యువకుడిని దొంగగా అనుమానించిన ట్రాఫిక్ ఎస్సై దిలీప్, తన సిబ్బందితో కలిసి చితకబాదాడు. తెలుగు మాట్లాడడం రాని సికిందర్ రోదిస్తూ వివరించే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. పోలీసులు కొట్టిన దెబ్బలకు ఆ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

తొమ్మిదేళ్లుగా మోసం చేస్తున్నారు

- హామీలు అమలెందుకు చేయలేదు
- మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం
- సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడి
- తోపులాటలు..వాగ్వాదాలు



బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

సిరిసిల్లటౌన్: అబద్ధాలతో అధికారం చేజిక్కించుకున్న కేసీఆర్ కుటుంబం తొమ్మిదేళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం విమర్శించారు. కలెక్టరేట్‌ను శుక్రవారం ముట్టడించిన సందర్భంగా మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, దళిత సీఎం, కేజీ టు పీజీ ఉచిత విద్య అనేక హామీలిచ్చిన సీఎం కేసీఆర్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కోకాపేట భూములు అమ్మి కేసీఆర్ ప్రభుత్వాన్ని నడుపుతున్నాడని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు.

చలో కలెక్టరేట్ ఉద్రిక్తం

బీజేపీ చేపట్టిన చలో కలెక్టరేట్ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. కలెక్టరేట్ ముందు భారీ బందోబస్తు ఉండగా కార్యకర్తలు కార్యాలయంలోని చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ప్రజాసమస్యలను నేరుగా కలెక్టర్ విన్నవించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అటు పోలీసులు, ఇటు బీజేపీ కార్యకర్తలు పలువురికి గాయాలయ్యాయి. నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, రెడ్డబోయిన గోపి, ఆడెపు రవీందర్, శీలం రాజు, అన్నల్‌దాస్ వేణు, బూర విష్ణు, మల్లడపేట భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నేరాల నియంత్రణకు బ్లూకోర్ట్స్, పెట్రోకార్ సిబ్బంది గస్తీ నిర్వహించాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. శాంతిభద్రతల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం రికార్డుల నిర్వహణ, రిసెప్షన్, జీడీ ఎంట్రీ రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న నేరాల సమూనాకు అనుగుణంగా గస్తీ, పెట్రోలింగ్ పెంచాలన్నారు. ప్రజాఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో తరచూ పర్యటించాలన్నారు. గ్రామీణులకు చట్టాలు, డయల్ 100, షీటీమ్స్, సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'సెస్'లో బదిలీల కుదుపు

- ఏకకాలంలో 86 మంది స్థానచలనం
- బదిలీ అయిన 'సెస్' ఎండీతో ఆదేశాలు
- పాలకవర్గం తీరుపై సిబ్బంది గుర్రు
- ఎనిమిది నెలలకే మళ్లీ బదిలీ



సిరిసిల్ల 'సెస్' ఆఫీస్ భవనం

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలు అందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో ఉద్యోగుల బదిలీలు దుమారం రేపాయి. బదిలీలు సహజమే అయినా.. ఒకేసారి 88 మందిని స్థానచలనం చేయడం.. అది కూడా బదిలీ అయిన మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణతో ఆదేశాలు జారీ చేయించడం కలకలం సృష్టించింది. గత ఎనిమిది నెలల కిందట బదిలీ అయిన సిబ్బందిని మళ్లీ కదలించడం చర్చనీయాంశమైంది. జిల్లాలో 'సెస్' సిబ్బంది, అధికారులు ఎక్కడైనా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నా ఇటీవల బదిలీ చేసిన వారిని మళ్లీ అక్కడి నుంచి కదలించడం కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నారు. 'సెస్' ఎండీ రామకృష్ణ స్థానంలో సహకారశాఖ నుంచి సూర్యచంద్రరావును ఎండీగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో రామకృష్ణ పేరిట ఒకేసారి 68 మంది అసిస్టెంట్ హెల్పర్లను, ఏడుగురు లైన్ ఇన్‌స్పెక్టర్లను, ఎనిమిది మంది అసిస్టెంట్ లైన్‌మెన్లను, ముగ్గురు ఎల్‌డీసీలను బదిలీ చేస్తూ ఆదేశాలు ఇవ్వడం చర్చకు దారితీసింది. పాలకవర్గంలోని సభ్యులు, చైర్మన్ దగ్గరుండి మరీ బదిలీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక వర్గం ఉద్యోగులను టార్గెట్ చేస్తూ పాలకవర్గం ఇలా వ్యవహరించడంపై ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. బదిలీ అయిన కొందరు ఉద్యోగులు పాలకవర్గంలోని డైరెక్టర్లను కలుస్తూ తమ బదిలీని రద్దు చేయాలని కోరినట్లు సమాచారం. ఈమేరకు డబ్బులు చెల్లించేందుకు సైతం కొందరు ఉద్యోగులు సిద్ధపడినట్లు తెలిసింది. మరికొందరు ఉద్యోగులు ఎక్కడైతే ఏందీ... చేసే పని ఒక్కటే కదా.. అని బిందాస్‌గా టైమ్ వచ్చినప్పుడు చూసుకుందాంలే అని బదిలీ అయిన చోటికి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఎన్నికల వేళ... బదిలీల గోల

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో ప్రభావవర్గంగా ఉన్న 'సెస్' సిబ్బంది 88 మందిని ఒకేసారి బదిలీ చేయడం గందరగోళంగా తయారైంది. పాలకవర్గంలోని ముఖ్యనేతలు కావాలనే అధికార పార్టీని ఇబ్బంది పెట్టే లక్ష్యంతో బదిలీలకు తెరలేపినట్లు భావిస్తున్నారు. ఏది ఏమైనా 'సెస్' పాలకవర్గ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. తమకు అనుకూలంగా ఉన్న వారిని బదిలీ చేయకుండా.. వ్యతిరేకంగా ఉన్న ఉన్నారనే అనుమానంతో స్థానచలన చేయడం చర్చనీయాంశమైంది. బదిలీ అయిన ఉద్యోగులు పాలకవర్గం తీరుపై గుర్రుగా ఉన్నారు. బదిలీ అయిన చోటుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

మణిపూర్‌లో అకృత్యాలు కుట్రపూరితమే

- కేసులు పెట్టారు.. అరెస్టులు చేయలేదు
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క
- సిరిసిల్లలో ప్రజా ప్రదర్శన సదస్సు



మాట్లాడుతున్న చలపతిరావు

సిరిసిల్లటౌన్: మణిపూర్‌లో అకృత్యాలు, హింస కుట్రపూరితంగా జరిగాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క విమర్శించారు. మణిపూర్ కుకి మహిళలపై జరిగిన అకృత్యాల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో శుక్రవారం ప్రజాప్రదర్శన నిర్వహించారు. తొలుత సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు వి.చలపతిరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయగా.. ప్రదర్శన జరిగింది. అనంతరం గాజుల మల్లయ్య ఫంక్షన్‌హాలులో జరిగిన సదస్సులో విమలక్క మాట్లాడారు. మణిపూర్‌లో కలిసి, మెలిసి ఉంటున్న ప్రజల మధ్య అధికార బీజేపీ విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. వేలాది సంఖ్యలో కేసులు పేరుకుపోగా ఇప్పటి వరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ వంటి సంఘటనలు మన రాష్ట్రాలకు వ్యాపించకముందే అప్రమత్తవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు వి.చలపతిరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విధివిధానాలపై పోరాడాలని కోరారు. గుజరాత్ ఫార్ములాను దేశం మొత్తంలో ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల ఆటపాటలు అలరించాయి. ప్రొఫెసర్ లక్ష్మి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రాగుల రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు బొజ్జ కనకయ్య, చెన్నమనేని పురుషోత్తంరావు, గుండా థామస్, కంచర్ల రవిగౌడ్, మార్వాడి గంగరాజు, పోకల సాయికుమార్, సౌమ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వరాలతల్లికి వందనం



చందుర్తి: మల్యాలలోని ఆలయంలో వరలక్ష్మీపూజలు చేస్తున్న మహిళలు



రాజన్న సన్నిధిలోని అమ్మవారికి ఒడిబియ్యం పోస్తున్న మహిళలు

వేములవాడ/చందుర్తి(వేములవాడ): శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రాజన్న సన్నిధిలోని రాజరాజేశ్వరీదేవీ, మహాలక్ష్మీ అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించుకున్నారు. చందుర్తి మండలం మల్యాల, బండపల్లిల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అర్చకులు కందాళై వెంకటరమణాచార్యులు, కొడంగల్లా శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న శ్రీకాంత్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గడపగడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కరీంనగర్‌లో బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలో ఇంటింటికీ కాషాయజెండాను చేరవేయాలన్నారు. నమిలికొండ శ్రీకాంత్, సాయిలు, రఘు ఉన్నారు.

29న రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న ఆలయ హుండీ లెక్కింపును ఈనెల 29న చేపట్టనున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఓపెన్‌స్లాబ్‌లో ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలవుతుందని, అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

అదృశ్యమైన ఆకాంక్ష ప్రేమపెళ్లి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటకు చెందిన అకుల ఆకాంక్ష మూడు రోజుల క్రితం అదృశ్యం కాగా.. ఒకరిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిసింది. ఆకాంక్ష తండ్రి ఫిర్యాదుతో పోలీసులు గత మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పదోతరగతి చదువుతున్న ఆకాంక్ష అదృశ్యం సంఘటన ఎట్టకేలకు ప్రేమ పెళ్లితో సుఖాంతమైంది. ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన గణేష్ అనే యువకుడిని ప్రేమవివాహం చేసుకుంది. ఈమేరకు పెళ్లి ఫొటోలను తన మిత్రులకు పంపగా ఈ విషయం వెలుగుచూసింది.

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సిరిసిల్లఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించే రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ క్రీడలకు సిరిసిల్లలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా టార్గెట్‌బాల్ సెలక్షన్స్ ఇటీవల జరిగాయి. ఎం.భువన, సాయి, దీక్షిత, సాహిత్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను, పీఈటీలు నవీన్, బాబులను ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అభినందించారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలకు చెందిన పడిగె దేవయ్య(35) కొన్నాళ్ల క్రితం మస్కట్‌కు ఉపాధి కోసం వలస వెళ్లాడు. ఈనెల 17న గుండెపోటుతో మృతిచెందగా.. మృతదేహం గురువారం సాయంత్రం ఇంటికి చేరింది. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనసారె అర్పితం



అమ్మవారికి చీర, సారె, ఒడిబియ్యం తీసుకొస్తున్న మహిళలు

- అమ్మవార్లకు చీర, సారె, ఒడిబియ్యం
- శ్రావణమాసంలోనే ప్రత్యేకం
- కార్మికక్షేత్రంలో వెల్లివిరిస్తున్న ఆధ్యాత్మికం

సిరిసిల్లటౌన్: శ్రావణమాసం పండుగలకు ప్రతీతి. ఆధునిక నాగరికతలోనూ పలువురు మహిళలు భక్తిమార్గాన్ని అనుసరిస్తున్నారు. పూజలు.. వ్రతాలు చేస్తూ ఆధ్యాత్మికబాట పడుతున్నారు. హరిహరులతోపాటు జగన్మాతను కొలుస్తూ దీక్షలు చేపడుతున్నారు. పూర్వీకులు అనుసరించిన చీర, సారె కార్యక్రమాన్ని విభిన్నంగా నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరాలకు అందిస్తున్నారు. కార్మిక క్షేత్రం సిరిసిల్లలో వెల్లివిరిస్తున్న ఆధ్యాత్మిక చింతనపై కథనం..


సిరిసిల్లలో కొలువుదీరిన విశాలాక్షి అమ్మవారు

శ్రావణం..ప్రత్యేకం

శ్రావణ మాసం అంటే పసుపు, కుంకుమ, సౌభాగ్యాలను కాంక్షిస్తూ.. అనేక వ్రతాలు.. పూజలు చేయడం పరిపాటి. అందరూ బాగుండాలని కోరుతూ పూజలు, వ్రతాలు నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా సిరిసిల్లలోని ఆలయాలతోపాటు గృహాల్లో నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విశాలాక్షి, శ్రీమహాలక్ష్మి, సరస్వతీ, సంతోషిమాతలను కొలుస్తున్నారు.

చీర..సారె.. ఒడిబియ్యం

అమ్మవారికి చీర..సారె..ఒడిబియ్యం పోయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత పురుషులతో సమానంగా పనిచేస్తున్న కాలంలోనూ మహిళలు ఆధ్యాత్మికతలో ఆనందాన్ని పొందుతున్నారు. ఈనేపథ్యంలో మొదటిసారిగా జగన్మాత విశాలాక్షికి చీర..సారె.. ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్మాతలు (దేవతలు) తమ పుట్టింటి నుంచి చీర..సారె.. తీసుకున్నట్లుగా అమ్మవార్లను తమ ఇంటి ఆడపడుచులుగా భావిస్తూ సకల లాంఛనాలతో చీర..సారె..ఒడిబియ్యం సమర్పిస్తున్నారు.



ముత్తయిదువుల మహానైవేద్యం

శ్రీదేవి, భూదేవి, అన్నపూర్ణదేవి, విశాలాక్షి, పార్వతీమాత, వాసవీమాత, అండాళమ్మ తదితర పేర్లతో గల అమ్మవార్లకు సిరిసిల్ల సుహాసినులు శ్రావణం సందర్భంగా మహానైవేద్యాలు సమర్పిస్తున్నారు. మహిళలకు పుట్టింటి వారు అందించే చీర..సారె..ఒడిబియ్యాన్ని అమ్మవార్లు తమ ఇంటి ఆడబిడ్డలకు భావిస్తూ ఒడిబియ్యం పోస్తున్నారు. కొత్త పట్టుచీర, ఐదు రకాల పిండి వంటలు, ఆరురకాల పండ్లతో చీర..సారె..ఒడిబియ్యం పోస్తున్నారు. ఇకపై ప్రతి ఆగస్టు 23న జగన్మాతకు చీర..సారె..ఒడిబియ్యంలో భాగంగా 550 సకినాలు, 550 గరిజెలు, పప్పుపూర్ణం, కోవాపేడ, గట్టిపిండి, శనగపప్పు, పసుపు, కుంకుమ, నగలు, కొత్తబట్టలను ఒడిబియ్యంతోపాటుగా సమర్పిస్తున్నారు. పురాతన ఆచారాన్ని కొత్తగా ఆచరిస్తున్నారు.

వాయినం.. శుభప్రదం



భక్తిశ్రద్ధలతో అమ్మవారికి వాయినాలు సమర్పించడం శుభప్రదం. చీర..సారె..ఒడిబియ్యం అనేది మన పూర్వీకులు ఆచరించారు. ఇప్పుడు ఆ సనాతన ధర్మాన్ని మేము, మా భవిష్యత్ తరాలు ఆచరిస్తాం. సకినాలు, బూరెలు, అరిసెలు, గర్జెలు, భక్ష్యాలతోపాటు ఆరురకాల పండ్లను అమ్మవారికి సమర్పించాం.

– గడ్డం పద్మశ్రీ

భక్తితో కొలువడమే..



అమ్మవార్లకు ఏ పేరుతో కైంకర్యాలు సమర్పించినా భక్తిలో భాగమే. శ్రావణమాసంలో ముక్కోటి దేవతలు ధరణిపై కొలువై ఉంటారనేది విశ్వాసం. ఈమేరకు జగన్మాతకు పుట్టింటి ఆచారం ప్రకారం పూజలు, వివిధ రకాల కైంకర్యాలు చేస్తాం.

– గుండ్లపెల్లి నీరజ, కౌన్సిలర్

ఆడపడచుగా భావించి..



జగన్మాతను ఇంటి ఆడపడచుగా భావించి చీర..సారె..ఒడిబియ్యం సమర్పిస్తున్నాం. పుట్టింటి నుంచి పసుపు, కుంకుమాలు తెచ్చుకుంటున్నట్లుగానే అమ్మవారికి అందివ్వడం అందరికీ మంచిది. అందరూ సుఖసంతోషాలు, సౌభాగ్యంతో ఉండాలని ఇవన్నీ ఆచరిస్తున్నాం.

– రాజారి మాధవి

ఆరువందల మందిమి..



ఈ ఏడాది నుంచి అమ్మవారికి చీర, సారె, ఒడిబియ్యం అందించాలన్న తలంపుతో 600 మంది మహిళలం కలిసి వచ్చాం. మహా నైవేద్యాలను పోటీపడి తీసుకొచ్చి సమర్పించడం విశేషం. శ్రావణమాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతాం.

– బుస్సా జ్యోతి

కాంగ్రెస్ టిక్కెట్‌కు చీటీ ఉమేశ్‌రావు దరఖాస్తు


దరఖాస్తు అందిస్తున్న ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ కోసం శుక్రవారం చీటీ ఉమేశ్‌రావు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్‌కు దరఖాస్తు అందించి మాట్లాడారు. పార్టీకి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధిగా పనిచేసిన తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఉమేశ్‌రావుకు మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, సీనియర్ నాయకులు ఆసరి బాలరాజుయాదవ్, ఎద్దుల భూపాల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు తాజొద్దీన్, జోగు సురేష్, దమ్ము శ్రీనివాస్‌రెడ్డి, తోక దేవదాసు, ఎల్లయ్య, రాజు మద్దతు పలికారు.

మామిడిపల్లిలో దొంగతనం

- వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ


బాధిత వృద్ధురాలు ఎల్లవ్వ

కోనరావుపేట (వేములవాడ): రహదారిపక్కన పొలం పనులు చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన వృద్ధురాలు అత్తిని ఎల్లవ్వ గ్రామశివారులోని గుంటి హన్మాన్ ఆలయ సమీపంలో వ్యవసాయం పనులు చేసుకుంటుంది. బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో ఉన్న 3 తులాల పుస్తెలతాడును లాక్కుని బావుసాయిపేట వైపు వెళ్లారు. డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైపాస్ రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం ప్రసవాలు జరగాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి


కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: సిరిసిల్లకు రెండు వైపులా ఉన్న బైపాస్ రోడ్ల వెంబడి డివైడర్లపై అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. బైపాస్ రోడ్లను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ట్యాంకర్లతో నీరు పోస్తూ మొక్కలను సంరక్షించాలని, ఎండిపోతే కొత్త మొక్కలు నాటాలన్నారు.

పీఆర్ గెస్ట్‌హౌస్‌లో వసతులు కల్పించాలి

జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల పరిశీలకులకు ఇక్కడే వసతి కల్పిస్తామన్నారు. అన్ని వసతులు ఉండాలని పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్‌కు సూచించారు.

అర్హులకు ఓటుహక్కు కల్పించాలి

జిల్లాలో అర్హత గల వారికి ఓటుహక్కు కల్పించాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఆగస్టు 26, 27 తేదీల్లో బూత్ లెవల్ అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉండి ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ టెలీకాన్ఫరెన్స్‌లోనూ ఓటర్ల నమోదుపై సమీక్షించారు. 2023 అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి యువకుడిని ఓటరుగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరగాలి

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలోనూ ప్రసవాలు జరిగాలని, ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం జరిగాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, డ్రైడే నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, డీపీవో రవీందర్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఉపవైద్యాధికారి శ్రీరాములు, డాక్టర్ రజిత, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్ పాల్గొన్నారు.

భవనం పై నుంచి కిందపడ్డ యువకుడు

- పది గంటలు చీకట్లో నరకయాతన
- పరిస్థితి విషమం


ఆస్పత్రిలో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న చిన్ను

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడ్డ యువకుడు చీకట్లో ఎవరూ చూడకపోవడంతో దాదాపు 10 గంటలు నరకయాతన పడ్డాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన కాతాని లింగారెడ్డి కుమారుడు కాతాని చిన్ను(26) గురువారం రాత్రి భోజనం అనంతరం భవనంపైకి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడ్డాడు. చీకటి కావడంతో ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లలేదు. శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లే రైతులు గమనించి చిన్ను కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మంత్రి దత్తత గ్రామంలో అభివృద్ధి శూన్యం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి
- రాజన్నపేటలో పార్టీ జెండా ఆవిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ ప్రజలను మభ్యపెట్టేందుకు దత్తత పేరుతో జిల్లాలో గ్రామాలను దత్తత తీసుకొని ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. మంత్రి దత్తత గ్రామం ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేటలో శుక్రవారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాజన్నపేటలో చాలా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వీర్నపల్లిని దత్తత తీసుకొని ఏం చేశారని ప్రశ్నించారు. అధికార పార్టీ వైఫల్యాలతో నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుందని, స్థానికుడినైన తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, రఫీ, రవి, బాపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబు, బుర్కాగౌడ్, రాంరెడ్డి, రాజునాయక్, శ్రీనివాస్, రాజయ్య, సురేష్, బాలయ్య, పర్శరాములు, సతీశ్, ఎల్లయ్య, రామచంద్రం తదితరులు ఉన్నారు.

పేదల గూడుపై సర్కారు నిర్లక్ష్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్


పెద్దూర్ శివారులో ఇండ్ల వద్ద సీపీఎం నిరసన

సిరిసిల్లటౌన్: పేదలకు సొంత గూడు కల్పిస్తామని తొమ్మిదేళ్ల క్రితం మాట ఇచ్చిన బీఆర్ఎస్ సర్కారు ఇప్పటికీ నెరవేర్చడం లేదని సీపీఎం ప్రధాన కార్యదర్శి మూశం రమేశ్ పేర్కొన్నారు. పెద్దూరు శివారులోని డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ వద్ద శుక్రవారం నిరసన తెలిపి మాట్లాడారు. నిరుపేదలకు ఇస్తామన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇవ్వడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందన్నారు. డ్రాలో పేర్లు వచ్చిన వారికి ఇండ్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. డ్రాలో పేర్లు రానివారికి కొత్తగా నివేశన స్థలాలిచ్చి, ఇళ్లు కట్టుకోవడానికి ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమాన్ని వదిలి మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రియల్ వెంచర్‌పై దృష్టి పెట్టడాన్ని తప్పుబట్టారు. ఈవిషయంపై ఈనెల 28న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు హెచ్చరించారు. నాయకులు శ్రీరాం సదానందం, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, మోర అజయ్, పోచమల్లు, స్వప్న, తిరుపతి, లత, బాబు, శ్రావణ్ పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ.. చెలరేగిన మంటలు

- లారీలోనే సజీవ దహనమైన డ్రైవర్..
- తీవ్రగాయాలతో బయటపడ్డ క్లీనర్


మంటల్లో కాలిపోతున్న లారీలు


తీవ్రంగా గాయపడిన ఇంజిమామ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగాయి. మంటల్లో డ్రైవర్ సజీవ దహనం కాగా క్లీనర్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హరియానా రాష్ట్రం పాల్వల్ జిల్లా హాతిని తాలుకాకు చెందిన అన్నదమ్ములు ఫర్వేద్(25), ఇంజిమామ్ లారీ డ్రైవర్, క్లీనర్‌గా ఏలూరులో పనిచేస్తున్నారు. ఏలూరు నుంచి ఏపీ 37టీఈ 5831 లారీలో టైల్స్ లోడ్ చేసుకొని మంచిర్యాల బయలుదేరారు. ఈక్రమంలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి పరిధిలో ఏపీ 29 టీబీ2382 నంబర్‌గల లారీ రాజీవ్ రహదారి పక్కనే ఉన్న మారుతి రైస్‌మిల్ నుంచి ధాన్యం లోడ్‌తో రోడ్డుపైకి వస్తుండగా టైల్స్ లోడ్‌తో ఉన్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న ఫర్వేద్ మంటల్లోనే సజీవ దహనం కాగా, క్లీనర్ ప్రమాదాన్ని గుర్తించి కిందకు దూకి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈప్రమాదంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఘటన స్థలానికి ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐ జగదీశ్‌లు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడీల పాలనను అంతమొందిద్దాం

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గడీల పాలనకు చరమగీతం పాడాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో గడీల పాలనను అంతమొందించి 60 శాతం బీసీలు ఉన్న సామాజికవర్గాన్ని గెలుపొందించుకోవాలని కోరారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, ఉద్యోగపరంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ 23 మంది బీసీలకు మాత్రమే ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించడం అన్యాయమన్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యే టిక్కెట్లను బీఎస్పీ నుంచి బీసీలకే కేటాయించనున్నట్లు తెలిపారు.

స్నే'క్'హితుడు



వేములవాడ: పాములను చూస్తేనే దూరంగా వెళ్లిపోతాం. అయితే వేములవాడకు చెందిన లక్ష్మణ్ మాత్రం ఎంచక్కా పామును పట్టి సురక్షిత ప్రాంతాల్లో వదిలేస్తుంటాడు. వేములవాడలోని మల్లారం రోడ్డులోని ఓ ఇంట్లో శుక్రవారం పాము చొరబడింది. గమనించిన యజమానులు లక్ష్మణ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే చేరుకున్న అతను పామును చాకచక్యంగా పట్టుకొని వెంట తెచ్చుకున్న సంచిలో వేసుకొని వెళ్లి శివారులోని సురక్షిత ప్రాంతంలో వదిలివేశాడు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తాను 3వేల పాములను పట్టినట్లు తెలిపారు. పాములను చంపకుండా బయట ప్రాంతాల్లో వదిలేస్తాను. ఇంత.. అంత అని ఏమి డిమాండ్ చేయను.. ఎంత ఇస్తే అంతే తీసుకుంట అంటున్నాడు. వేములవాడ పట్టణంలోని ఎవరి ఇళ్లలోనైన పాములు చొరబడితే తన 96768 42352 నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే వచ్చి పట్టి తీసుకెళ్తానని తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో అండాళమ్మ సేవ



సిరిసిల్లటౌన్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సిరిసిల్లలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముత్తయిదువలు ఇళ్లలోనే శ్రీమహాలక్ష్మిని అలంకరించి అర్చనలు జరిపారు. శ్రీగాల వెంకన్న క్షేత్రంలో రాత్రి తిరువీధుల్లో అండాళమ్మ సేవా కార్యక్రమం నిర్వహించారు.